# 58. తప్పు దారి

తపస్సు చేసుకోడానికి అడవికి వెళ్తున్న ఒకాయనకి ఓ నక్క కనిపించింది. దానికి ఓ కాలు లేదు. కుంటిదైన ఆ నక్క ఆహారం ఎలా సంపాదిస్తుందా అనిపించిందతనికి. ఆ సంగతి తెలుసుకోవాలని అతను ఓ చెట్టెక్కి కూర్చుని చూడసాగాడు.

కొద్దిసేపటికి ఓ పులి వచ్చింది. దాని నోట్లో చచ్చిన ఓ లేడి పిల్ల ఉంది. తినగలిగినంత తిన్నాక ఆ పులి మిగిలిన మాంసాన్ని వదిలి వెళ్ళిపోయింది. నక్క ఆ మిగిలింది తిన్నది. మర్నాడు కూడా పులి వదిలి వెళ్ళిన ఆహారం ద్వారా ఆ కుంటినక్క తన కడుపు నింపుకుంది. దేవుడి మీద అమితమైన విశ్వాసంగల ఆ మనిషి తనకీ దేవుడు ఆ నక్కకిలాగే ఆహారం సమకూరుస్తాడని, ఆహారం కోసం తను కాలాన్ని వృధా చేసుకోనవసరంలేదనీ భావించాడు. ఓ కొండగుహలో కూర్చుని తపస్సులో మునిగిపోయాడు.

రోజు గడిచింది. అతనాశించినట్లుగా అతనికి ఆహారం అందలేదు. మర్నాడు, ఆ తర్వాతి రోజు కూడా అతనికి ఆహారం రాలేదు. నాలుగో రోజు అతని కడుపు ఆకలితో నకనకలాడసాగింది.

వెంటనే అతను తలని పైకెత్తి చూస్తూ ఆవేదనగా అడిగాడు.

"ఏమిటిది దేవా! నీ భక్తుడనైన నేను ఆ కుంటినక్క పాటి చెయ్యనా? నక్కకి ఆహారం అందించినట్లుగానే నాకూ ఆహారాన్ని ఇస్తావనుకున్నాను."

వెంటనే ఆకాశవాణి అతనికిలా జవాబిచ్చింది.

"ఓ తపస్వి. నువ్వు తప్పుదారిలో ఆలోచిస్తున్నావు. అవకరం గల నక్కని ఆదర్శంగా తీసుకోకు. ఆరోగ్యంగా ఉన్న పులి మార్గం ఎన్నుకో. నీ ఆహారం నువ్వే సంపాయించుకుని, నువ్వు తినగా మిగిలింది ఇతరులకి పెట్టు."